


నవభూమి

పాలమూరు

అనుబంధం

12 ఏప్రిల్,2025 శనివారం పేజీలు:5

www.epaper.navabhoomi.in


## ప్రాథమిక హక్కులు రాజ్యాంగం కల్పించిన

# ఒక వరం

- విద్యార్థులు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను వినియోగించుకోవాలి
- భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి
- జిల్లా న్యాయ సేవఅధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వి.రజని






**వనపర్తి ఏప్రిల్ 09 (నవభూమి ప్రతినిధి)** ప్రాథమిక హక్కులు రాజ్యాంగం కల్పించిన ఒక వరం అని వనపర్తి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ న్యాయమూర్తి వి. రజని అన్నారు. వనపర్తి పట్టణంలోని బాలుర షెడ్యూల్ క్యాస్ట్ షెడ్యూల్ ట్రైబ్ వసతి గృహాలలో వనపర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను వినియోగించుకుంటూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అదేవిధంగా మాదకద్రవ్యాలకు మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడి యువత జీవితాలను ఎలా నాశనం చేసుకుంటున్నారని, ఆ అలవాటు నుండి ఎలా బయటపడాలో సూచించే తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థచే రూపొందించబడిన లఘు చిత్రాలను విద్యార్థులకు చూపించారు. చట్టాలను వివరించడంలో భాగంగా వినియోగదారుల చట్టం, బాల్యవివాహాల చట్టం, మోటార్ వెహికల్ యాక్ట్,బాల కార్మికుల చట్టం సైబర్ క్రైమ్స్ గురించి తెలియజేశారు. ఉచిత న్యాయ సలహాల కొరకు 15100 టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జి.ఉత్తరయ్య అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఏం.రఘు, వసతి గృహం సిబ్బంది సత్యనారాయణ, శివశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

# వనపర్తి జిల్లా ఎస్పీని కలిసిన

## బిసిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చెన్న రాములు



**వనపర్తి ఏప్రిల్ 09 (నవభూమి ప్రతినిధి)** వనపర్తి జిల్లా ఎస్పీ గిరిధర్ ని బిసి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నాగనమోని చెన్న రాములు ముదిరాజ్ మర్యాద పూర్వకంగా కలిసి బీసీ ఉద్యమ సమస్యలు పరిష్కారం గురించి చర్చించడం జరిగింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ స్థానిక సంస్థలు విద్యా ఉద్యోగ ఉపాధి అవకాశాలలో కల్పించాలని ప్రభుత్వాలకు వినతిపత్రాలు అందజేస్తున్నామని, అదేవిధంగా ప్రైవేటు విద్యాలయాల్లో విద్యార్థులపై మానసికంగా అణచివేస్తుండడం వల్ల ఆత్మహత్యలు జరుగుతున్నాయని, వీటిపట్ల విద్యార్థులకు మానసిక ధైర్యాన్ని కలిగించే విధంగా విద్యార్థులకు శిక్షణను ఇచ్చే విషయమై చర్చించడం జరిగింది. యువకులు మాదకద్రవ్యాలు గుట్కాల బారినపడి తమ ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటూ ప్రాణాలు కోల్పోతున్నారని సంఘ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని, జూన్ మాసంలో యువకులకు సామాజిక చైతన్యం కార్యక్రమం చేస్తూ “ యువజన వికాసం - భవిష్యత్తు “ గురించి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ తో సూచించారు. “నేరాలను తగ్గించడం - సామాజిక శాంతి నెలకొల్పడం “ అంశం పై శిక్షణ తరగతులకు ఆహ్వానించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిసి ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అమడబాకుల రామన్ గౌడ్, మాజీ ఎంపీటీసీ, బి సి ఎఫ్ మైనారిటీ విభాగం ఆర్ఎమ్ హెఫ్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు ఖదీర్ పాష, బి సి ఎఫ్ కొత్తకోట మండల అధ్యక్షులు దారమోని గంగాధర్ ముదిరాజ్, బి సి ఎఫ్ మైనారిటీ విభాగం ఆర్ఎమ్ హెఫ్ కొత్తకోట మండల అధ్యక్షులు షేక్ మైనోద్దీన్ , బి.సి ఎఫ్. యువజన విభాగం బీసీవైహెఫ్ కొత్తకోట పట్టణ అధ్యక్షులు షేక్ ముషారఫ్ తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన గ్యాస్ ధరలు వెంటనే

# తగ్గించాలని సీపీఎం నిరసన




2

# రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావడం పక్కా




2

## మహిళాభివృద్ధి విద్యతోనే గుర్తించిన

# మహనీయులు జ్యోతిరావు పూలే

**బాపట్ల - నవభూమి :** విద్యతోనే మహిళలు అభివృద్ధి సాధిస్తారని గుర్తించిన గొప్ప మహనీయులు మహాత్మా జ్యోతిరావు పూలే అని బాపట్ల పార్లమెంట్ సభ్యులు,పానెల్ స్పీకర్,హెూం వ్యవహారాల స్టాండిరగ్ కమిటీ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ తెలిపారు.మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి కార్యక్రమం శుక్రవారం స్థానిక బాపట్లలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద జరిగింది.మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పార్లమెంట్ సభ్యులు కృష్ణ ప్రసాద్,జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి,బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ,జిల్లా అధికారులు పలువురు పుష్పమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు. మహాత్మా జ్యోతిరావు పూలే త్యాగాలు మరువలేనివని పార్లమెంట్ సభ్యులు చెప్పారు.మహిళలకు విద్య అవసరం లేదని చిన్నచూపు చూసే బ్రిటిష్ పరిపాలనలో మహిళల కొరకు పూలే పాఠశాలను ప్రారంభించారని గుర్తు చేశారు.ఆయన భార్య సావిత్రిబాయి పూలేకి చదువు చెప్పి ఆమె ద్వారా తన ఇంటి నుంచి ఉద్యమాన్ని ప్రారంభించారన్నారు.మహారాష్ట్రలోని తన ఇంట్లో ప్రారంభమైన ఉద్యమం దేశవ్యాప్తంగా వ్యాపించిందని తెలిపారు.అక్షరాస్యతతోనే మహిళల అభ్యున్నతి సాధించగలరని గుర్తించి అనేక పాఠశాలలను ప్రారంభించారన్నారు. ఆనాటి ఉద్యమం సత్ఫలితాలనివ్వగా,నేడు అన్ని రంగాలలో మహిళలు పోటీ పడడం సంతోషదాయకమన్నారు.ఏప్రిల్ నెలలోనే మహనీయుల పుట్టినరోజులను ప్రభుత్వం అధికారికంగా జరపడం అభినందనీయమన్నారు.మహిళల సాధికారత కొరకు 150 సంవత్సరాల క్రితమే మహాత్మా జ్యోతిరావు పూలే భారత్‌లో ఉద్యమాలు ప్రారంభించిన తొలి యోధుడని జిల్లా కలెక్టర్ వెంకట మురళి చెప్పారు.బీసీల ఆరాధ్య దైవంగా మహాత్మా పూలే జ్యోతిరావుపూలే చరిత్రలో నిలిచిపోయారని ప్రశంసించారు.భర్త చనిపోగానే చితిలోనే మహిళలను కాల్చివేయడం వంటి సాంఘిక దురాచారాలను నిషేధించిన గొప్ప నాయకుడని అభినందించారు.బాల్య వివాహాలు, అంటరానితనం,మహిళలకు విద్య, రిజర్వేషన్లపై పోరాటాలు చేసిన గొప్ప యోధుడన్నారు.మహిళలకు విద్య అందించడానికి తమ సంపాదన మొత్తాన్ని సమాజం కొరకు ఖర్చు చేసిన గొప్ప మహనీయులని వివరించారు.మహాత్మా జ్యోతిరావు పూలే సమాజానికి స్ఫూర్తిదాయకుడని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ,స్త్రీకి సమానత్వం రావాలని పోరాడిన గొప్ప సామాజిక నాయకులుగా పూలే నిలిచారన్నారు. మహాత్ముల పుణ్యఫలమే వెనకబడిన సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు అందుతున్నాయని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ ఆథారిటి చైర్మన్ శలగాల రాజశేఖర్ బాబు,జిల్లా రెవిన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్,బీసీ సంక్షేమ శాఖ అధికారిని శివలీల,ఆర్డీవో పి.గ్లోరియా,ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారని రాజా దెబోరా,బీసీ,ఎస్సీ సంఘాల నాయకులు మోహన్ గౌడ్, చారువాక తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఇంటి నుండి పారిశ్రామికవేత్తలు రావాలన్నదే సీఎం కల



**బాపట్ల -నవభూమి :** ప్రతి ఇంటి నుండి పారిశ్రామికవేత్తలు రావాలనే సీఎం కలలు సాకారం అవుతున్నాయని బాపట్ల పార్లమెంట్ సభ్యులు, పానెల్ స్పీకర్,హెూం వ్యవహారాల స్టాండిరగ్ కమిటీ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ చెప్పారు.బీసీ సంక్షేమ శాఖ,కార్పొరేషన్ల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కాపు కళ్యాణ మండపంలో మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి కార్యక్రమం జరిగింది.ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి ప్రజా ప్రతినిధులు,అధికారులు పలువురు పుష్ప మాలలతో ఘనంగా నివాళులు అర్పించారు.ఎంపీ,జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యేలు,బుడా చైర్మన్‌లు జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించారు.వేడుకలలో భాగంగా రూ.10.25 కోట్లు విలువ చేసే 412 యూనిట్లను ప్రజా ప్రతినిధులు,అధికారుల చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎంపీ మాట్లాడుతూ డబుల్ ఇంజిన్ సర్కార్ రాష్ట్రంలో పాలన సాగిస్తుందన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివక్షత, అంటరానితనంపై ఎన్నో పోరాటాలు చేశారన్నారు.ప్రజల సంక్షేమం కొరకు చేపట్టిన ఉద్యమాలతో ప్రజలే పూణే రాజు పాలనలో జ్యోతిరావు పూలేకి మహాత్మా అనే గొప్ప బిరుదుతో సత్కరించారన్నారు.విజయవాడ నుంచి గూడూరు వరకు రూ.రెండు వేల కోట్లతో నాలుగో వరుస రైల్వే లైన్ మంజూరు అయ్యిందన్నారు.రేపల్లె-తెనాలి మధ్య రెండవ రైల్వే లైన్ మంజూరు అయ్యిందన్నారు.గుంటూరు నుంచి నిజాంపట్నం వరకు రూ.1200 కోట్లతో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే మంజూరు అయ్యిందన్నారు.పర్యాటక రంగం అభివృద్ధికి రూ.97.52 కోట్లు నిధులు వచ్చాయన్నారు.రూ.29 కోట్లతో బ్రిడ్జిలు నిర్మిస్తున్నట్లు చెప్పారు.- దేశంలో సాంఘిక సంస్కరణలు తెచ్చిన మహాత్మా జ్యోతిరావు పూలే గొప్ప సంఘ సంస్కర్త అని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. సమాజం అభ్యున్నతికి పాటుపడిన గొప్ప నాయకులు పూలే చరిత్రలో నిలిచిపోయారన్నారు.150 ఏళ్ల క్రితమే రాజరికం,బ్రిటిష్ పరిపాలనలో పోరాటాలు చేసిన గొప్ప యోధుడు అన్నారు.మహిళలకు విద్య అందించాలని, ప్రతి ఒక్కరికి సమాన విద్య అందించాలనే దృక్పథంతో జ్యోతిరావు పూలే చేపట్టిన ఉద్యమం దేశ చరిత్రలో నిలిచిపోయిందన్నారు.జిల్లాకు రూ.35 కోట్లు రాగా,1366 మంది అర్హులైన అభ్యర్థులను గుర్తించామన్నారు.జాతీయ పండుగలో 412 మంది లబ్ధిదారులకు రూ.10.25 కోట్ల విలువచేసే యూనిట్లు అందిస్తున్నామన్నారు. - బీసీల అభ్యున్నతి కోసం జ్యోతిరావు పూలే చేసిన కృషి వెలకట్టలేనిదని శాసనమండలి సభ్యురాలు పోతుల సునీత చెప్పారు.కులవివక్షత, అంటరానితనం నిర్మూలనపై ఆయన చేపట్టిన పోరాటాలు వర్ణించలేనివన్నారు.విద్యతోనే మహిళల అభివృద్ధి సాధ్యమని గుర్తించి మొదట తన భార్యకి విద్యాభ్యాసం చేసిన గొప్ప మేధావి అని వివరించారు.మహిళలు ఆర్థిక,సామాజిక,రాజకీయ రంగాలలో అభివృద్ధి సాధించినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు అవుతుందన్నారు.బీసీలకు 50శాతం రిజర్వేషన్లు,మహిళలకు 33శాతం రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. బీసీల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు.బీసీల ఐక్యతే ప్రభుత్వ ధ్యేయమన్నారు.భరతమాత ముద్దుబిడ్డలుగా డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్,మహాత్మా జ్యోతిరావు పూలే,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌లు నిలిచారన్నారు. ప్రజల గుండెల్లోనూ,దేశ చరిత్రలోనూ వారు చిరస్థాయిగా చెరగని ముద్రలు వేసుకున్నారన్నారు.ప్రభుత్వం కల్పించే అవకాశాలు,అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక అభివృద్ధి వైపు అడుగులు వేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్,జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారిని శివలీల,మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధన్ రెడ్డి,బిసి నాయకులు శంకరరావు,జయప్రకాష్ నారాయణ,వీరరాఘువయ్య,జి.శ్రీనివాసరావు,కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## వక్ఫ్ చట్టం రద్దు చేయాలని

# బాపట్లలో భారీ ర్యాలీ

◆ ర్యాలీకి తరలివచ్చిన వేలాది మంది ముస్లిం సోదరులు ◆ ర్యాలీలో పాల్గొన్న పలు రాజకీయ పార్టీల నాయకులు

**బాపట్ల -నవభూమి :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టాన్ని తక్షణమే భేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బాపట్ల అంజుమన్ ఏ ఇస్లామియా ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు.బాపట్ల నియోజకవర్గంలోనీ పలు మసీదుల నుంచి వేలాది మంది ముస్లిం సోదరులు,మతపెద్దలు,వివిధ రాజకీయ పార్టీల నాయకులు,లౌకికవాదులు పాల్గొన్నారు.స్థానిక పాత బస్టాండ్ వద్ద గల అంజుమన్ ఇస్లామియా మసీదు నుండి బయలుదేరిన ర్యాలీ చీల్ రోడ్డు పాత బస్టాండు అంబేద్కర్ సర్కిల్ మీదుగా తహసిల్దార్ కార్యాలయం వరకు వేలాది మందితో భారీ ర్యాలీ చేరింది.అంతకుముందు అంబేద్కర్ సెంటర్లో ముస్లిం సోదరులు మానవహారం నిర్వహించారు.జుమ్మా నమాజ్ అనంతరం జాతీయ జెండాలు,ప్లకార్డులు,ఫ్లెక్సీలతో ముస్లిం సోదరులు నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసన వ్యక్తం చేశారు.బిజెపి ప్రభుత్వం కుట్రపూర్తిగా ముస్లింల హక్కులను కాలరాసేందుకు అనేక నల్ల చట్టాలు చేస్తుంది.ముస్లింల జీవన విధానం హరించే వేసే విధంగా ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తుంది. హిందువుల ఓట్లను కొల్లగొట్టడానికి మతతత్వ ఎజెండాతో ముందుకు పోతుంది.దేశంలో అనేక సమస్యలు ఉన్న వాటిని పట్టించుకోకుండా ముస్లింలపై కక్ష కట్టి నిరంకుశ పాలన కోన సాగిస్తుంది.అనంతరం అంజుమన్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రహీం జానీ కార్యదర్శి అబ్దుల్ కరీం కమిటీ సభ్యులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు స్థానిక తహసిల్దార్ షేక్ సలీమాకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా అంజుమన్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ రహీం జానీ మాట్లాడుతూ వక్ఫ్ అంటే ముస్లింల సోదరులు తమకు ఉన్న సంపదలో అల్లా పేరిట దానం చేసే ఆస్తి అన్నారు.స్వాతంత్రం ముందు నుండి ముస్లిం సోదరులకు వక్ఫ్ ఆస్తులు ఉన్నాయన్నారు.వక్ఫ్ బోర్డులో అన్యమతస్తులను భాగస్వామ్యాన్ని చేసి వారికి అధిక ప్రాధాన్యత కల్పించడం సమంజసం కాదన్నారు.కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముస్లింలు, క్రైస్తవుల హక్కులకు భంగం కలిగిస్తుందన్నారు.కేంద్ర ప్రభుత్వం దురాగతాలపై సమిష్టిగా పోరాడి వాటిని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ గంగయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టానికి తమ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు.సమాజ్వాది పార్టీ జిల్లా ఇన్చార్జి గొర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న ముస్లిం వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు ఖాలీలుల్లా ఖాన్,జబీబుల్లా సిపిఎం పట్టణ నేత కే.శరత్,సిపిఐ జిల్లా కార్యదర్శి సింగరకొండ,బి.ఎస్.పి నియోజకవర్గ ఇన్చార్జి రాజారావు,వైసీపీ బాపట్ల జిల్లా దివ్యాంగుల అధ్యక్షులు చల్లా రామయ్య,సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్‌తో పాటు ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్,ముస్లిం మత పెద్దలు,ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

